



కొబ్బరి కారం రుచి చూపిస్తున్న మహిళ

కళాత్మకం

కొబ్బరి ఉత్పత్తులతో అద్భుత సృష్టి





కొబ్బరి పీచుతో గూడులు











ఓ స్టాల్ వద్ద బొమ్మలు

అమలాపురం రూరల్, ఆగస్టు 28: కోనసీమ కొబ్బరి నుంచి కళాకారులు ఎన్నెన్నో అద్భుతాలను సృష్టించారు. పాఠశాల స్థాయి విద్యార్థులతో పాటు ఎందరో తమ సృజనాత్మకతను జోడించి వివిధ రకాల ఆకృతులను తయారుచేసి మదిని దోచుకున్నారు. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో రెండో రోజు బుధవారం జాతీయ స్థాయి కొబ్బరి రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు తయారుచేసిన కొబ్బరి ఉప ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచగా హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. ప్రధానంగా కొబ్బరి పీచుతో తయారుచేసిన పిచ్చిక గూళ్లు, చిలుక జంటల విన్యాసాలు, వివిధ రకాల జంతువుల బొమ్మలు, చిన్న పిల్లల ఆటబొమ్మలు, గోదిసీలు, కొబ్బరి ఇటుకలు ఇలా ఎన్నో అద్భుత కళాఖండాలను ప్రదర్శనలో ఉంచారు. కొబ్బరితో ఆరోగ్యం అంటూ తయారుచేసిన కొబ్బరి బర్ఫీ, పాలు, జున్ను భళా అనిపించాయి. ఇక కోకోనట్ ఆయిల్, ఎడిబుల్ ఆయిల్‌తో పాటు దేవి అనే మహిళ తయారు చేసిన కొబ్బరి కారంతో పాటు అంబాజీపేట మండలం తొండవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కొబ్బరి చిప్పలతో తయారుచేసిన టీ కప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం కిమ్స్ కళాశాల ప్రాంగణంలో జరిగిన అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సులో పలు రాష్ట్రాలకు చెందిన రైతులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కొబ్బరి పరిశ్రమ వృద్ధి, రైతు అభ్యున్నతి, పంట సంరక్షణకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

అమలాపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):



తీర్మానాలను ఆమోదిస్తున్న రైతులు

రైతు నాయకుల అభిప్రాయాలు

కేంద్రం ప్రత్యేక రాయితీ అందించాలి

కొబ్బరి రైతుల సమస్యలపై ఇప్పటికే కొబ్బరి పండించే మూడు రాష్ట్రాల్లో జాతీయస్థాయి సదస్సులు నిర్వహించాం. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించాం. కోనసీమ వంటి ప్రాంతాల్లో చమురు సంస్థల ప్రభావం కొబ్బరి పంటపై పడింది. కొబ్బరి ధర విపరీతంగా పడిపోయింది. కొబ్బరిని ప్రోత్సహించే దిశగా కేంద్రం ప్రత్యేక రాయితీలు, ధరలు నిర్ణయించాల్సిన అవసరం ఉంది.

సుందరరాజన్,
బీకేఎస్ జాతీయ కన్వీనర్

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి..

ఎనిమిది రాష్ట్రాల్లో ప్రధానంగా కొబ్బరి సాగు జరుగుతుంది. అయితే రవాణా సదుపాయం కొబ్బరి రైతులకు భారంగా మారింది. కొబ్బరితో పాటు అనుబంధ ఉత్పత్తులను రవాణా చేసుకునేందుకు గూడ్స్ రైళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అమెరికాలో సాగు చేసే రైతుల కంటే మనదేశంలో భారతీయ కిసాన్‌సంఘ్‌లో సభ్యులే ఎక్కువ. నష్టాలు వస్తున్నప్పుడు కొబ్బరిసాగు చేయడం ఎందుకని కేంద్ర అధికారి ఒకరు చెబితే బీకేఎస్ సరైన సమాధానం ఇచ్చింది.

మోహినీమోహన్‌మిశ్రా,
బీకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి

నేడు తెలుగు భాషా దినోత్సవం



కాట్రేనికోనకు చెందిన ప్రముఖ చిత్రకారుడు ఆకొండి అంజి గీసిన చిత్రం

తెలుగు..వెలుగు

అచ్చ(చ్చు) తెలుగు భాష
అమ్మ గర్భమునందే ఆలకించిన భాష
ఆంధ్రముగా ఖ్యాతి గాంచిన ప్రాచీన భాష
ఇలలో అందమైన లిపి గల రెండో భాష
ఈస్ట్ ఇటాలియన్‌గా ప్రపంచాన కీర్తికెక్కిన భాష
ఉచ్ఛ్వాస నిస్వాసల్లో తొణికిసలాడు భాష
ఊపిరితో పాటు ఉదయించిన ఉగ్గుపాల భాష
రుణం తీర్చలేని అమ్మ నేర్పిన కమ్మని భాష
ఎదురొడ్డి పోరాడిన గిడుగు వాడుక భాష
ఏడు ఖండాలలో వెలుగులీనిన దివ్య భాష
ఐక్యమునందు సహృదయ సుకుమార భాష
ఒంపు సొంపుల నుడికార కమనీయ భాష
ఓనమాలలో తీయదనం ఒలికే అమృత భాష
ఔన్నత్యాన్ని చాటిచెప్పిన అజంతా భాష
అంధకారాన్ని చీల్చే భానుడిలా జ్వలించు భాష
తేట తెనుగు భాష.. నా తెలుగు భాష

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని..

మాకే బాలార్జునసత్యనారాయణ
తెలుగు అధ్యాపకుడు, అమలాపురం

కొబ్బరి ఉప ఉత్పత్తులపై జాతీయ స్థాయిలో ప్రచారం జరగాలి

7లో

తహసీల్దార్లు బదిలీ

అమలాపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొమ్మిది మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కె.కాశీ విశ్వేశ్వరరావును కలెక్టరేట్ పరిపాలనాధికారిగా నియమించారు. కేజే ప్రకాశ్‌బాబును ఆలమూరు, బి.మృత్యుంజయరావును మామిడికుదురు, సీహెచ్ నాగలక్ష్మమ్మను అయినవిల్లి తహసీల్దార్లుగా నియమించారు. కొత్తపేట ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా ఎస్.శ్రీదేవి, రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా ఎల్.ఝాన్సీకుమారిను నియమించగా సీహెచ్ విజయశ్రీ (ఐ.పోలవరం), పరమట శ్రీపల్లవి (పి.గన్నవరం), గెడ్డం రవీంద్రనాథ్‌ఠాగూర్(మలికిపురం) తహసీల్దార్లుగా నియమించారు.

180 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్టు

రావులపాలెం, ఆగస్టు 28: జాతీయ రహదారిపై రవాణా చేస్తున్న రూ.9 లక్షల విలువైన 180 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్టు రావులపాలెం టౌన్ సీఐ జేమ్స్ రత్నప్రసాద్ తెలిపారు. ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో రావులపాలెం మండలం రావులపాడు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి సీఐ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం నుంచి ఉత్తరప్రదేశ్ వెళ్తున్న లారీని నిలుపుదల చేసి తనిఖీ చేయగా రూ.9 లక్షలు విలువైన 180 కిలోల గంజాయిని గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, గంజాయి రవాణా చేస్తున్న సివేఎస్.సింగ్, పంకజ సురేష్ కాకాలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. వీరిని గురువారం కొత్తపేటలో కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ఇసుక దొంగలు



ఇసుక తరలించగా ఖాళీగా ఉన్న ప్రాంతం

రామచంద్రపురం మండలం వెల్లసావరం జగనన్నకాలనీలో ఇసుక దొంగలు పడ్డారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 3 వేల టన్నుల ఇసుకను రాత్రికి రాత్రే తరలించేశారు. వైసీపీ, టీడీపీ కార్యకర్తలు తోడు దొంగలుగా మారి ఈ బాగోతాన్ని నడిపించారు. హౌసింగ్ ఏఈ కేవీ భాస్కర్ ఫిర్యాదుతో వారిపై ద్రాక్షారామ పోలీసులు కేసులు నమోదు చేశారు.

3 వేల టన్నుల చోరీ

- వెల్లసావరం జగనన్నకాలనీలో భారీగా ఇసుక చోరీ
- వైసీపీ, టీడీపీ కార్యకర్తలపై కేసులు
- రాత్రికిరాత్రే తరలించిన వైనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

ద్రాక్షారామ, ఆగస్టు 28 :ఇసుక దొంగతనానికి సంబంధించి సీఐ కడియాల అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెల్ల సావరం జగనన్న లేఅవుట్ 4లో జగనన్న గృహనిర్మాణ లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు గృహ నిర్మాణశాఖ అధికారులు 6245 టన్నుల ఇసుకను నిల్వచేశారు. అందులో 3 వేల టన్నులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ నెల 27 ఉదయం ప్రతీరోజు ఇసుక తనిఖీలో భాగంగా అధికారులు వెళ్లి చూడగా ఇసుక దొంగతనం జరిగినట్టు గుర్తించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించగా తాళ్లపొలంలో రైల్వేట్రాక్ వద్ద స్థలంలో ఆ ఇసుక డంప్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. అయితే అక్కడ డంప్ చేసిన ఇసుకను ఆ తర్వాత మాయం చేశారు. అక్కడ జేసీబీ వద్ద కట్టాపండు అనే వ్యక్తి ఉన్నాడు. దీంతో అతనిని గట్టిగా అడగగా జేసీబీ తనదేనని చెప్పి మొత్తం ఇసుక తరలింపు వివరాలు చెప్పినట్టు హౌసింగ్ ఏఈ భాస్కర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 26 రాత్రి 11 గంటలకు 3 వేల టన్నుల ఇసుకను కట్టా అశోక్ అలియాస్ పండు, కాండ్రేగుల సాయిరామ్, ఆదిమూలం సాయిమణికంఠ, వాసంశెట్టి చంద్రశేఖర్ అలియాస్ బాల జేసీబీతో లారీల్లో తరలించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఈ ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ ఎస్ఐ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అశోక్ తెలిపారు.

నిందితులపై కేసులు

జగనన్న కాలనీలో ఇసుక తరలింపు రామచంద్రపురంలో దుమారం లేపింది. వైసీపీ కార్యకర్తలు కట్టా అశోక్ అలియాస్ పండు, కాండ్రేగుల సాయిరామ్, టీడీపీ కార్యకర్తలు ఆదిమూలం మణికంఠ, వాసంశెట్టి చంద్రశేఖర్ అలియాస్ బాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయంపై మంత్రి వాసంశెట్టి సుభాష్ సీఐతో ఫోన్‌లో మాట్లాడి నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మినవారిపైనా, కొనుగోలు చేసిన వారిపైనా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

రేవు పాట రూ.2.98 కోట్లు

అంతర్వేది, ఆగస్టు 28: సఖినేటిపల్లి-నర్సాపురం రేవు పాట బుధవారం ఖరారైంది. నర్సాపురంలో జరిగిన ఈ రేవు పాట సమావేశంలో నర్సాపురానికి చెందిన శ్రీకనకదుర్గ శాండ్ అండ్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో భూపతినాయుడు రూ.2 కోట్ల 98 లక్షలకు పాట దక్కించుకున్నారు. గురువారం నుంచి పాటదారుల ఆధ్వర్యంలో రాకపోకలు జరగనున్నాయి.

సెప్టెంబరు 12 నుంచి అంతర్వేదిలో పవిత్రోత్సవాలు

7లో

పోలవరం అవకతవకలపై విచారణ జరగాలి

మాజీ ఎంపీ హర్షకుమార్

మదర్సాలో బాలుడి మృతి

అంతర్వేదిపాలెంలో ఘటన..7లో

కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు

అమలాపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు, కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హెచ్చరించారు. గత జూలై నెలలో ఎన్టీఆర్ జిల్లాలోని బుధవాడ అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదం నేపథ్యంలో జిల్లాలోని పరిశ్రమలు, కర్మాగారాల్లో ప్రమాదాలు నివారించేందుకు, భద్రతా ప్రమాణాలపై క్షేత్రస్థాయి పరిశీలనకు జిల్లాస్థాయి సేఫ్టీ అండ్ వెల్ఫేర్ అసెస్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 27 ప్రమాదభరితమైన పరిశ్రమలు గుర్తించి భద్రతా ప్రమాణాలపై పరిశీలన జరిపి సంయుక్త ఇన్‌స్పెక్షన్ నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లో జిల్లా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. 27 పరిశ్రమల ప్రతినిధులతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జిల్లాలో అమ్మోనియా నిర్వహణకు సంబంధించిన ఫ్యాక్టరీలు ఏడు, హెక్సాన్ సాల్వెంట్ నిర్వహణకు సంబంధించిన ఫ్యాక్టరీలు, పెస్టిసైడ్ ఫ్యాక్టరీలు రెండు, పేపరు పరిశ్రమ ఫ్యాక్టరీలు 6, స్టీలు పరిశ్రమలు రెండు ఉన్నాయన్నారు. ఇప్పటికే పలు ఫ్యాక్టరీలకు నోటీసులు జారీ చేశామన్నారు. 14 రోజుల్లో సంబంధిత యాజమాన్యాలు నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్లు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అసంఘటిత రంగ కార్మికులు ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయించుకుని బీమా సౌకర్యం పొందేలా అవగాహన కల్పించాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పార్థసారథి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ డీకేవీ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ పార్థసారథి, డీఎంహెచ్‌వో డాక్టర్ దుర్గారావుదొర పాల్గొన్నారు.

- ఇటీవల జరుగుతున్న వరుస ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- పలు ఫ్యాక్టరీలకు ఇప్పటికే నోటీసులు అందించాం
- జిల్లా స్థాయి సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్
- హాజరైన కంపెనీల ప్రతినిధులు



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ

జ్వరాల వ్యాప్తిని అరికట్టాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

ఇంటింటికీ ఫీవర్ సర్వే నిర్వహించి జ్వర బాధితులకు చికిత్స అందించడం ద్వారా వైరల్ జ్వరాల వ్యాప్తిని అడ్డుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా వ్యాధుల ప్రొఫైల్‌ను సమర్పించాలన్నారు. కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీల వారీగా కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైరల్ జ్వరాలు ఎక్కువగా ప్రబలుతున్నందున పూర్తి సమాచారం సేకరించాలన్నారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో రెవెన్యూ, పోలీసు అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లాలో రోజుకు సగటున 150 జ్వరాల కేసులు నమోదు అవుతున్నాయని వైద్యాధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో 61 డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్, డాక్టర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా..

ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు అందజేత



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, ఆగస్టు 28: కష్టంలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని, ఊడిమూడిలో జరిగిన ప్రమాద ఘటనలో బాధితులకు రూ.10 లక్షల చొప్పున సాయం అందించడమే దానికి నిదర్శనమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం జనసేన పార్టీ కార్యాలయం వద్ద రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ నామన రాంబాబుతో కలిసి బుధవారం ఆయన రూ.10 లక్షలు వంతున చెక్కులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాద సమయంలో బాధిత కుటుంబాలు ఆందోళనకు దిగితే ఆ సమయంలో ఏ ప్రభుత్వం అధికారంలో లేకపోయినప్పటికి వారిని సముదాయించి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రస్తుత అధికారుల సాయంతో బాధిత కుటుంబాలను ఆదుకున్నామన్నారు. సాయాన్ని మంజూరు చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బాధిత కుటుంబాలైన నూకపెయ్యి బేబీ, వాసంశెట్టి దుర్గ, ఈరి సుబ్బలక్ష్మి, చిలకలపూడి వెంకటేశ్వరావుకు చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఇన్‌చార్జ్ తహసీల్దారు రమాదేవి, సర్పంచ్ బొండాడ నాగమణి తదితరులు పాల్గొన్నారు.


యువకులకు సంఘీభావం తెలుపుతున్న మురళీకృష్ణ

యువ చైతన్య యాత్ర

మండపేట, ఆగస్టు 28: మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు, హత్యలపై ప్రజలను చైతన్యపరిచేందుకు ముగ్గురు యువకులు నడుంబిగించారు. విజయవాడ నుంచి కోల్‌కతా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతపురానికి చెందిన ప్రదీప్‌కుమార్, అన్నవరానికి చెందిన ఆకేటి సూరిబాబు, హైదరాబాద్‌కు చెందిన దొంత రాధాకృష్ణ ఈ నెల 21న విజయవాడలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద పాదయాత్ర ప్రారంభించారు. వారు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడికి చేరుకోగా బీజేపీ నాయకుడు టి.మురళీకృష్ణ కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ కోసం చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని, దాడులకు అత్యాచారాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, కోల్‌కతాలోని మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద ముగుస్తుందని చెప్పారు.

12 నుంచి పవిత్రోత్సవాలు

అంతర్వేది, ఆగస్టు 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సెప్టెంబరు 12 నుంచి 15వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు. 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, ఆదివాసాలు, 13, 14 తేదీల్లో ఉదయం అలంకార తిరుమంజనాలు, ప్రాయశ్చిత్త హోమాలు, పవిత్రారోహణ, 15న మహా శాంతి హోమం, పూర్ణాహుతి, గ్రామోత్సవం, రాత్రి పవిత్ర అవరోహణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పాలు, పవిత్రాల వినియోగం జరుగుతాయని అర్చకులు తెలిపారు.

25 లక్షల కోట్ల బకాయిల రద్దు వెనుక భారీ స్కామ్

- పోలవరం అవకతవకలపై విచారణ జరపాలి
- అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 28: ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల కాలంలో రూ.25లక్షల కోట్ల బకాయిలను రద్దు చేయించడం వెనుక భారీ స్కామ్ జరిగిందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనలాంటి వారు బ్యాంకు రుణం తీసుకుంటే ముక్కుపిండి వసూలు చేసే బ్యాంకులు బడా కార్పొరేట్ సంస్థలకు మాత్రం రుణ మాఫీ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. 25లక్షల కోట్ల అప్పులను రద్దు చేయించిన వారి పేర్లను బయటపెట్టాలని కోరుతూ ప్రధాని మోదీకి, ఆర్‌బీఐ గవర్నర్‌కు లేఖలు పంపానన్నారు. పోలవరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై కమిటీ వేసి విచారణ జరపాలన్నారు. కాఫర్‌డ్యామ్ నిర్మించాలని, బాధితులకు పునరావాసం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల్లో సీట్ల కేటాయింపులో జరుగుతున్న అవకతవకలపై మండిపడ్డారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విచారించాలన్నారు. విశాఖ పోర్టులో పట్టుబడిన 25వేల కిలోల కొకైన్ కేసులో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. రాజ్యాంగ సవరణ జరగకుండా ఎస్సీ వర్గీకరణ చెల్లదని, అందుకే తాను సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశానన్నారు. క్రీమీలేయర్ విధానంతో అట్టడుగు దళితులు నష్టపోతారని, వచ్చేనెల 17న తన పోరాట కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుల దాడి



గాయపడ్డ నాయుడు

కోటనందూరు, ఆగస్టు 28: కాకినాడ జిల్లా కోటనందూరు మండలం ఎస్ఆర్ పేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కుసిరెడ్డి వీరవెంకట సత్య మణికంఠ నాయుడిపై వైసీపీ నాయకులు దాడి చేసి గాయపరిచారు. మణికంఠనాయుడు మంగళవారం రాత్రి భీమవరపుకోటలోని చెల్లెలి ఇంటికి వెళ్లి వస్తుండగా ఎస్ఆర్ పేట గ్రామ శివారులోని బ్రాందీ షాపు సమీపంలోని కల్వర్టు వద్ద అన్నంరెడ్డి మహేష్, అన్నంరెడ్డి సత్యనారాయణ, అన్నంరెడ్డి దుర్గాప్రసాద్, రుత్తల అయ్యప్ప దాడి చేశారు. గతంలో తన పెదనాన్న గొడవలను మనసులో పెట్టుకోవడంతో పాటు టీడీపీలో యాక్టివ్‌గా పని చేస్తుండడంతో ఈ దాడికి పాల్పడ్డారని బాధితుడు కోటనందూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొబ్బరి ఉప ఉత్పత్తులపై జాతీయ స్థాయిలో ప్రచారం చేయాలి

- దేశంలో 43వేల రకాల పంటల సాగు
- కొబ్బరి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి
- రైతుల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తా: ఎమ్మెల్యే ఆనందరావు
- అమలాపురంలో కొబ్బరి రైతుల జాతీయ సదస్సు


అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సును జ్యోతిప్రజ్వలనతో ప్రారంభిస్తున్నజాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీమోహన్‌మిశ్రా, మాట్లాడుతున్న జాతీయ కన్వీనర్ సుందరరాజన్



అమలాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి ఉప ఉత్పత్తులపై జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించాలని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీ మోహన్ మిశ్రా పేర్కొన్నారు. కొబ్బరి ఉప ఉత్పత్తులను తయారుచేసేందుకు రాయితీలతో పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. దేశంలోని 127 క్లైమేటివ్ జోన్లలో 43వేల రకాల పంటలు సాగవుతున్నాయనివివరించారు. కొబ్బరి పండించే జోన్ నుంచే ఇస్రో, డీఆర్‌డీవోవంటి సంస్థల్లో ఎందరో శాస్త్రవేత్తలుగా ఎదిగారని రైతుల హర్షధ్వానాల మధ్య తెలిపారు. ప్రపంచంలో ఎత్తైన పంటను పండించే కొబ్బరి రైతులు తలెత్తుకునేలా తిరిగితేనే దేశం అభివృద్ధి బాటన నడుస్తుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కొబ్బరి రైతుల జాతీయ సదస్సు నిర్వహించారు. తొలుత బీకేఎస్ పతాకాన్ని జాతీయ కన్వీనర్ సుందరరాజన్ ఆవిష్కరించారు. భరతమాత, బలరామకృష్ణుడు చిత్రపటాలకు పూజలు నిర్వహించి జ్యోతిప్రజ్వలన చేశారు. పార్టీలు వేరైనా.. కులాలు వేరైనా.. మతాలు వేరైనా.. పంటలు వేరైనా.. రైతులంతా ఒక్కటేనంటూ పిడికిలి బిగించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

సుందరరాజన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు పరిమి వెంకటరాఘవులు, జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి మాట్లాడుతూ కొవిడ్ విపత్తు సమయంలో అన్ని వ్యవస్థలూ నిలిచిపోయినా ప్రపంచవ్యాప్తంగా రైతులు మాత్రమే చేలల్లో దిగి పంటలు పండించారన్నారు. కొవిడ్‌తో ఏ ఒక్క రైతూ చనిపోలేదన్నారు. మన్‌కీ బాత్‌లో ప్రధాని నరేంద్రమోదీ పనస పొట్టుపై మాట్లాడడంతో దానికి డిమాండు విపరీతంగా పెరిగిందన్నారు. 2026ని కొబ్బరి సంవత్సరంగా ప్రకటించి కొబ్బరిపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సి ఉందన్నారు. 20 ఏళ్ల క్రితం కొబ్బరి కాయ ధర రూ.20 ఉంటే ప్రస్తుతం రూ.7కు పడిపోయిందని, దానికి తోడు నాణ్యత కూడా తగ్గిపోయిందన్నారు. కొబ్బరి రైతులను ఆదుకునేలా మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందన్నారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒడిసా నుంచి హాజరైన బీకేఎస్ నాయకులు తమ సమస్యలను వివరించారు. కర్ణాటక అధ్యక్షుడు గంగాధర్, తమిళనాడు అధ్యక్షుడు పార్థసారథి, వేటుకూరి సూర్యనారాయణరాజు, యాళ్ల దొరబాబు, రాష్ట్ర కార్యదర్శి కవులూరి పతిరాజు, రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కొండబాబు, నడింపల్లి సీతారామరాజు, బీకేఎస్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం, మాజీ అధ్యక్షుడు బొక్కా ఆదినారాయణ మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సెప్టెంబరులో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నల రూపంలో తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 1996 తుపాను తర్వాత కొబ్బరి రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారన్నారు. క్షేత్రస్థాయిలో వారి సమస్యలను గుర్తించికేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రధాన తీర్మానాలను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

తీర్మానాలు ఇవీ

- కోనసీమలో కొబ్బరిని ప్రోత్సహించే విధంగా సీపీసీఆర్‌ఐ రీజనల్ రీసెర్చ్ సెంటరును కోనసీమలో ఏర్పాటు చేయాలి.
- అన్ని రకాల పంటలకు మూల్య వృద్ధి సేవలు, నూతన సాంకేతికతను రైతులకు బదిలీ చేసేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలి.
- కోనసీమలో కోకోనట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.
- ప్రస్తుతం ఉన్న ప్యాక్ హౌస్ స్కీమును మార్పులు చేసి కొబ్బరి కురిడీ తయారు చేసుకునేలా బాల్‌కొప్రా హౌస్ పేరుతో ఎక్కువ రాయితీ అందించాలి.
- ఆర్అండ్ఆర్ స్కీము ద్వారా దిగుబడి తక్కువ ఇచ్చే చెట్లను తొలగించి వాటి స్థానంలో అధిక దిగుబడులు ఇచ్చే పొట్టి రకాలను పెంచేలా మైక్రో న్యూట్రియంట్ ఎరువులను సరఫరా చేసే విధానం అమలు చేయాలి.
- కొబ్బరి పండించే ఎనిమిది రాష్ట్రాల రైతులు ఫోరంగా ఏర్పడి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి.
- వ్యవసాయ ఉత్పత్తుల కోసం ప్రత్యేకంగా తక్కువ ధరతో కిసాన్ రైలు పేరిట రైల్వే రవాణా సదుపాయం కల్పించాలి.
- కొప్రాకు మద్దతు ధరపై కర్ణాటక ప్రభుత్వం ఇస్తున్న బోనస్ రూ.1,500 మాదిరిగానే కొబ్బరి పండించే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు బోనస్ ప్రకటించాలి.
- కొబ్బరిని ఎడిబుల్ ఆయిల్‌గా ప్రకటించి అన్ని రకాల పంటలకు వర్తించే అన్ని రాయితీలను వర్తింపజేయాలి.
- కొబ్బరిని కల్తీచేసే కెర్నాయిల్‌పై పూర్తి నియంత్రణ ఉండాలి.
- కొబ్బరి వినియోగం పెంచేందుకు కొబ్బరి అభివృద్ధి బోర్డు చర్యలు తీసుకోవాలి.
- కొబ్బరిలో దింపు సమస్యను అధిగమించే విధంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ఉపయోగించి హార్వెస్టింగ్ చేసే యంత్రాలు తయారుచేయాలి.
- కొబ్బరి బోడకాయ ధర కిలో రూ.45గా నిర్ణయించి ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయాలి.


గంజాయి రవాణా ముఠా వివరాలు వెల్లడిస్తున్న నల్లజర్ల సీఐ శ్రీనివాస్




గంజాయి నిందితుల వివరాలు చెప్పున్న చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా

గంజాయి గుట్టురట్టు

తూర్పు గోదావరి జిల్లా అనంతపల్లిలో 262 కిలోలు, ఏజెన్సీలో 265 కిలోలు పట్టివేత

నల్లజర్ల, ఆగస్టు 28: కాకినాడ జిల్లా జగ్గంపేట నుంచి చెన్నైకి గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాను నల్లజర్ల పోలీసులు వలపన్ని పట్టుకుని అరెస్టు చేశారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను సీఐ ఎన్.శ్రీనివాస్ వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన రవివర్మ రమేష్, సూర్య ధనేష్ మురగన్, జీవరత్నం గణేశం, అలుగు నవిన్ పళనిస్వామి కలిసి 262 కిలోల గంజాయి కొనుగోలు చేసి ఐషర్ వ్యాన్‌లో చెన్నైకి తరలిస్తున్నారు. సీఐ శ్రీనివాస్‌కు వచ్చిన సమాచారంతో అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఐషర్ వ్యాన్ ముందు ఎస్కార్ట్‌గా ఎరుపు రంగు స్విఫ్ట్ కారు ఉంది. ఐషర్ వ్యానును ఆపి చూడగా గంజాయి బయటపడింది. ఐషర్ వ్యాన్, స్విఫ్ట్ కారు సీజ్ చేసి మొబైళ్లు స్వాధీనం చేసుకుని వారి వద్ద ఉన్న రూ.3,100 నగదు తీసుకుని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ శ్రీహరిబాబు, ఏఎస్ఐ మోహన్, హెచ్‌సీ స్టాలిన్, పృథ్వీరాజు, రవికుమార్, షేక్ రషీద్, తారకేశ్వర రావు, తేజేంద్రనాథ్‌లను తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ దేవకుమార్ అభినందించారు.

చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పోలీసులు 265 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా వెల్లడించారు. మొదటి కేసులో తెలంగాణ రాష్ట్రం గోదావరి ఖనికి చెందిన నిమ్మల మణికంఠ ఒడిసాలో 20 కేజీల గంజాయి కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి మోతుగూడెం మీదుగా తెలంగాణకు తరలించే యత్నం చేశాడు. మోతుగూడెం పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో పట్టుబడ్డాడు. రెండో కేసులో తెలంగాణ రాష్ట్ర యాదాద్రి భువనగిరికి చెందిన ధీరావత్ గణేష్ ఒడిసాలో 215 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. ఇతడు కూడా అక్కడి నుంచి మోతుగూడెం మీదుగా కారులో తరలిస్తూ పోలీస్ చెక్‌పోస్టు వద్ద దొరికిపోయాడు. మూడో కేసులో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలానికి చెందిన సోయం సందీప్, షేక్ హర్బజ్, కొర్సా నవీన్, నారకొండ ప్రకాష్, మినప హరిప్రసాద్‌లతోపాటు తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన సవలం ప్రకాష్, సానబోయిన శ్రావణ్‌కుమార్ పట్టుబడ్డారు. వీరంతా ఒడిసాలో 30 కేజీల గంజాయి కొనుగోలు చేశారు. వీరంతా చింతూరు బస్టాండులో తెలంగాణ రాష్ట్రం వెళ్లే బస్సు కోసం ఎదురు చూస్తూ పోలీసులకు దొరికిపోయారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు ఒక మోటారు సైకిలును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం పట్టుబడ్డ 265 కిలోల గంజాయి విలువ రూ.13.25 లక్షలు ఉంటుంది. మూడు కేసుల్లో పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు పాల్గొన్నారు.


మహ్మద్ రిహాన్ మృతదేహం

మదర్సాలో బాలుడి మృతి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

అంతర్వేది, ఆగస్టు 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలోని మదర్సా స్కూల్లో 4వ తరగతి చదువుతున్న మహ్మద్ రిహాన్ మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో మంచినీళ్లు తాగుతూ సొమ్మసిల్లి పడిపోయాడు. బాలుడు చనిపోయాడని భావించిన స్కూలు యాజమాన్యం హైదరాబాద్‌లో ఉంటున్న బాలుడి బావ మహ్మద్‌మెర్సిన్‌కు సమాచారం ఇచ్చింది. మహ్మద్ మెర్సిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. రిహాన్ తల్లిదండ్రులు జార్ఖండ్ రాష్ట్రం జెహిర్‌గట్టి గ్రామానికి చెందిన వారు. బాలుడి మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి పంచనామా అనంతరం బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కుడుపూడి దుర్గాశ్రీనివాస్ తెలిపారు.

56 మంది డిశ్చార్జ

- చికిత్స పొందుతున్న బాలికలను పరామర్శించిన కాకినాడ ఎంపీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే, ఆర్డీవో
- సెలవులు ప్రకటించడంతో ఇళ్లకు తీసుకువెళ్లిన తల్లిదండ్రులు


బాలికల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఆర్డీవో సీతారామారావు

ఏలేశ్వరం, ఆగస్టు 27: కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికలను కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఆర్డీవో సీతారామారావు బుధవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాలికల యోగక్షేమాలు, వారికి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన చికిత్స అందించడంతో పాటు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. చికిత్స పొందుతున్న బాలికలకు ఎమ్మెల్యే పండ్లు పంపిణీ చేశారు. డీసీహెచ్ఎస్ స్వప్న మాట్లాడుతూ మంగళవారం రాత్రి 72 మందికి వైద్య సేవలు అందించగా బుధవారం ఉదయం మరో 17 మంది చేరారన్నారు. 6వ తరగతి చదువుతున్న జాస్మిన్‌ను మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. బుధవారం సాయంత్రానికి కోలుకున్న 56 మందిని డిశ్చార్జి చేశామని చెప్పారు. తహసీల్దారు ఆర్వీ వెంకటేశ్వరరావు, జనసేన ప్రత్తిపాడు ఇన్‌చార్జి తమ్మయ్యబాబు, జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, నాని, కూటమి నాయకులు, కార్యకర్తలు బాలికల యోగక్షేమాలను అడిగి తెలుసున్నారు.

గురుకుల బాలికల సంక్షేమ పాఠశాల, కళాశాలను ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పరిశీలించారు. విద్యార్థినులకు పెట్టే మెనూ, వసతులు, తాగునీరు తదితర అంశాలపై ప్రిన్సిపాల్ చంద్రశారదను ఆరా తీశారు. వసతి గృహం, వంటశాల పరిసరాలను పర్యవేక్షించి విద్యార్థినుల ఆహారం, ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పాఠశాల ఆవరణలోని తుప్పలను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆహార పదార్థాలు, తాగునీటి శాంపిల్స్‌ను జిల్లా కేంద్రానికి శాంపుల్స్ పంపించామని, రిజల్ట్ వచ్చిన తర్వాత సంబంధీకులపై చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిస్థితులు మెరుగుపడేవరకు సెలవులు ప్రకటించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. దీంతో తల్లిదండ్రులు వచ్చి వారి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు.


మంచాలు లేక పరుపులపై చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సచివాలయ ఉద్యోగులకు

నేడు కౌన్సెలింగ్

కాకినాడ స్మార్ట్ సిటీ హాలులో ఉదయం 8 గంటల నుంచి

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 28: వార్డు, సచివాలయ ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బదిలీలు కోరుకునే వారంతా తమ దరఖాస్తులను ఈ నెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొంది. సంబంధిత శాఖల్లో ఖాళీల ఆధారంగా బదిలీ ప్రక్రియ జరగనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధి గల 319 వార్డు సచివాలయాల్లోని ఉద్యోగుల్లో బదిలీ కోరుకునే వారంతా సంబంధిత వెబ్‌సైట్‌లో ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అపాయింట్‌మెంట్ అథారిటీ పరిశీలించి కాకినాడ స్మార్ట్ సిటీలో గురువారం వీరందరికీ కౌన్సెలింగ్ నిర్వహించనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 319 సచివాలయాల ఉద్యోగులకు కాకినాడ స్మార్ట్ సిటీ హాలులో కమిషనర్ భావన ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఆర్‌డీఎంఏ పరిధిలో అడ్మిన్ సెక్రటరీలకు మండపేట కమిషనర్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు పెద్దాపురం కమిషనర్, వెల్ఫేర్ సెక్రటరీలకు పిఠాపురం కమిషనర్, శానిటేషన్ సెక్రటరీలకు తుని కమిషనర్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సూపరిండెంట్ ఇంజనీర్ పబ్లిక్ హెల్త్ (ఎస్ఈపీహెచ్) పరిధిలోని ఇమ్యూనిటీ సెక్రటరీలకు, రీజనల్ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఆర్‌డీటీసీపీ పరిధిలో ప్లానింగ్ సెక్రటరీలకు ఉదయం 8 గంటలకు కౌన్సెలింగ్ మొదలవుతుంది. కమిషనర్లతో పాటు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలోని సెక్షన్ల సూపరిటెండెంట్లు, గుమస్తాలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది సహకరించనున్నారు. బదిలీ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఈ నెల 31వ తేదీలోపు జాయినింగ్ ఆర్డర్ ఇస్తామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జోన్-2 ఇన్‌చార్జి రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో గంజాయిని మూలాలతో పెకిలిస్తాం

- ఆస్తి, సైబర్, మహిళలు, పిల్లలపై నేరాలను సహించేది లేదు
- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

రాజమహేంద్రవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'గంజాయిని అరికట్టడంపై తీవ్రంగా దృష్టిసారించాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాము. ఉత్పత్తి, విక్రయ, నిల్వ, వాడకందారులను వదిలేది లేదు. గంజాయి మహమ్మారిని మూలాలతో పెకిలించడానికి 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో పక్కాగా సిద్ధమయ్యాం' అని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన రాజమహేంద్రవరంలోని తూర్పు గోదావరి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహ కిషోర్‌తో కలిసి నేరాలపై సమీక్షించారు. ఆస్తి, సైబర్, మహిళలు, పిల్లలపై జరిగే నేరాలపై కూడా దృష్టి పెట్టామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పాత నేరస్తులు, అసాంఘిక వ్యక్తుల కదలికలపై నిఘా ముమ్మరం చేశామన్నారు. విజిబుల్ పోలీస్, ఇన్విజిబుల్ పోలీసింగ్ విధానాలతో నేరాలను కట్టడి చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని, మిస్సింగ్ కేసుల్లో వేగంగా స్పందించాలన్నారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్, నేరాలు, రోడ్డు ప్రమాదాల అదుపునకు జిల్లాలో తీసుకుంటున్న చర్యలను ఐజీకి ఎస్పీ నరసింహ కిషోర్ వివరించారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని, స్నేహపూర్వక పోలీసింగ్‌కి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

'మారుతినగర్ సుబ్రమణ్యం' చిత్ర యూనిట్ సందడి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 28: 'మారుతినగర్ సుబ్రమణ్యం' సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షక దేవుళ్లకు చిత్ర యూనిట్ ధన్యవాదాలు తెలిపింది. ఇప్పటివరకు విలన్, క్యారెక్టర్ యాక్టర్‌గా చేసిన రావు రమేష్ ప్రధాన పాత్రలో రూపొందిన ఈ చిత్రం నవ్వుల పువ్వులు పూయిస్తూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. విజయ యాత్రలో భాగంగా రాజమహేంద్రవరంలో సినిమా ప్రదర్శిస్తున్న శివజ్యోతి థియేటర్‌కి బుధవారం సాయంత్రం చిత్ర యూనిట్ విచ్చేసి సందడి చేసింది. లక్ష్మణ్ కార్య రచన, దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రావు రమేష్, అంకిత్ కొయ, ఇంద్రజ, రమ్య పసుపులేటి, అజయ్, హర్షవర్ధన్, శివన్నారాయణ, అన్నపూర్ణ తదితరులు నటించారు. పుష్ప డైరెక్టర్ సుకుమార్ భార్య తబిత ఈ చిత్రాన్ని సమర్పించారు. సినిమా ప్రమోషన్‌లో అల్లు అర్జున్ ఎంట్రీ కావడం ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది. వర్ధమాన నటుడు అంకిత్, నటి రమ్య పసుపులేటి, డైరెక్టర్ లక్ష్మణ్ స్క్రీన్ దగ్గర ఏర్పాటుచేసిన వేదిక దగ్గరకు వచ్చి ప్రేక్షకులతో ముచ్చటించారు. సినిమా పంపిణీ చేసిన మైత్రి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ ఉదయరాజు, సత్తి సత్తిరెడ్డి చిత్ర యూనిట్‌కు స్వాగతం పలికారు. నటుడు అంకిత్ మాట్లాడుతూ తాను ఇంత వరకు 12 సినిమాల్లో నటించినా, ఈ సినిమాతోనే మంచి గుర్తింపు లభించిందన్నారు. సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్టీసీ బస్సుకింద పడి మహిళ మృతి

కాకినాడ క్రైం, ఆగస్టు 28: కాకినాడలో బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు కిందపడి ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రత్తిపాడు మండలం ధర్మవరం అంబేడ్కర్ కాలనీకి చెందిన గుమ్మళ్ల నాగరత్నం (35) బుధవారం రాత్రి కాకినాడ జగన్నాథపురం నుంచి యానాం రోడ్డు వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తోంది. ఆమె శివాలయం వద్దకు వెళ్లేసరికి అటువైపే కాకినాడ నుంచి అమలాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రం కింద ప్రమాదవశాత్తూ అదుపు తప్పి నాగరత్నం పడిపోయింది. ఆమె తలపై భాగం నుంచి బస్సు చక్రం ఎక్కడంతో తల నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాకినాడ వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుప్రీం కోర్టు తీర్పును పునఃపరిశీలించాలి

మామిడికుదురు, ఆగస్టు 28: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని డిమాండు చేస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు మామిడికుదురు తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో కలిగితి పల్లంరాజు, నల్లి శ్రీనివాస్, బొంతు మణిరాజు, మట్టా సత్తిబాబు, చిలకపాటి శ్రీధర్, బత్తుల జనార్ధన్, నెల్లి దుర్గాప్రసాద్, కుసుమ పెరుమాళ్లకుమార్ పాల్గొన్నారు.

లక్కవరంలో కార్పొరేట్ వైద్యం అందిస్తాం


లక్కవరం పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, ఆగస్టు28: లక్కవరంలో ఆనాడు మంగెన కుటుంబీకులు ప్రజా ఆరోగ్యం కోసం ఏవిధంగా తాపత్రయం పడ్డారో మనం వారి ఆశయాలకు తగ్గట్టే ఇక్కడ కార్పొరేట్ వైద్యం ప్రైవేటు భాగస్వామ్యంతో పేదలకు అందేలా చర్యలు తీసుకుందామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. 2.60ఎకరాల భూమిఉందని, రెండు ఎకరాల స్థలం ఖాళీగా ఉందని, ఈస్థలాన్ని ప్రైవేటు భాగస్వామ్యంతో కార్పొరేట్ వైద్యం ప్రజలకు చౌకగా అందించేలా చేద్దామన్నారు. రాజోలు ప్రభుత్వాసుపత్రిని ఎన్‌సీసీ సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. లక్కవరం పీహెచ్‌సీ స్థలాన్ని ఆయన పరిశీలించారు. మంగెన భూదేవి, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, సర్పంచ్ కోట పుష్పకుమారి, ముప్పర్తి నాని, మంగెన నాని పాల్గొన్నారు.

వెలువలపల్లిలో అపారిశుధ్యం.. జ్వరాల బారిన ప్రజలు

అయినవిల్లి, ఆగస్టు28: వెలువలపల్లి గ్రామంలో అపారిశుధ్యం తాండవిస్తుండడంతో ప్రజలు జ్వరాల బారిన పడి విలవిల్లాడుతున్నారు. గ్రామంలో 30మందికిపైగా వైరల్ ఫీవర్లు ఉన్నట్టు స్థానికులు తెలిపారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలు బుధవారం వెలువలపల్లిలో పర్యటించి జ్వర పీడితులను పరామర్శించారు. గ్రామంలో నెలకొన్న అపారిశుధ్యంపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ సదుపాయం లేకపోవడం, శానిటేషన్ పనులు చేయకపోవడాన్ని గుర్తించారు. వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులోఉండాలని వైద్యాధికారులను ఆదేశించారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. సర్వే వివరాలను ప్రజాప్రతినిధులకు వివరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బి.మంగాదేవి, నాయకులు మద్దాల సుబ్బారావు, పోలిశెట్టి రాజేష్, సలాది బుచ్చిరాజు, నిమ్మకాయల సత్యనారాయణ, మద్దా చంటిబాబు, వేటుకూరి రమేష్‌రాజు పాల్గొన్నారు.


ఎంపీ హరీష్, ఎమ్మెల్యే సత్యనారాయణకు జ్వర పీడితుల వివరాలు తెలియచేస్తున్న వైద్యాధికారి

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


గుమ్మిలేరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం



ఆలమూరు, ఆగస్టు 28:గుమ్మిలేరు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవంఅంగరంగ వైభవంగా జరిగింది. రూ.40లక్షలతో చేపట్టిన ఆలయ అభివృద్ధి పనుల అనంతరం సంప్రోక్షణ కార్యక్రమం మూడురోజులుగా నిర్వహిస్తున్నారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. తదుపరి వేదపండితుల పర్యవేక్షణలో గ్రామానికి చెందిన వంక సత్యనారాయణ,తులసిగంగాభవాని దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద గోపూజ నిర్వహించారు. వేలాది మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌వీవీ చౌదరి, టీడీపీ నాయకులు ఆకుల రామకృష్ణ, సర్పంచ్ గుణ్ణం రాంబాబు స్వామివారిని దర్శించుకున్నారు.

గణపతికి వెండి కవచం బహూకరణ



ఆత్రేయపురం, ఆగస్టు28: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ క్షేత్రపాలకుడు శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆల యంలో వేంచేసియున్న గణపతికి రాజమహేంద్రవరానికి చెందిన జల్లేపల్లి సురేష్ బాబు కుటుంబ సభ్యులు రూ.1.60లక్షలు విలువైన 1.900 కిలోల వెండి కవచం బహూకరించారు. సంప్రోక్షణ అనంతరం గణపతికి కవచాన్ని అలంకరించారు. దాతలకు ఉపకమిషనరు కిశోర్‌కుమార్ స్వామివారిచిత్రపటం అందజేశారు.

ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ఉప్పలగుప్తం, ఆగస్టు 28: ఈనెల29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా బుధవారం గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లాంగ్ జంప్, హైజంప్, కబడ్డీ, వాలీబాల్ తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి. హెచ్ఎం లంక రాణి ఆధ్వర్యంలో ఎస్ఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన పోటీలను పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్ పర్యవేక్షించారు. విజేతలకు బహుమతులు అందించారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- ఎటుచూసినా అపరిశుభ్ర వాతావరణమే
- పారిశుధ్యం పేరుతో రూ.లక్షల్లో పంచాయతీల లెక్కలు


బాలయోగి కాలనీలో దుస్థితి

ఐ.పోలవరం, ఆగస్టు 28: గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. పరిసరాల పరిశుభ్రం పేరుతో గ్రామపంచాయతీలు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్టు లెక్కలు చూపిస్తున్నప్పటికీ పరిసరాలు మాత్రం అపరిశుభ్రంగానే ఉంటున్నాయి. భారీ వర్షాలు, వరదలు సంభవించినప్పుడు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి ముంపునీరు నిల్వ ఉండి దోమలు విజృంభిస్తున్నాయి. ఈనేపథ్యంలో పంచాయతీలు సకాలంలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రజలు మొరపెట్టుకున్నా పంచాయతీలు పారిశుధ్య పనులు చేపట్టలేదన్న ఆరోపణలున్నాయి. ఐ.పోలవరంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. బాణాపురం బాలయోగి కాలనీ ముంపు కంపుతో అనారోగ్యానికి చిరునామాగా మారింది. రోజుల తరబడి ముంపునీరు రోడ్లపై నిల్వ ఉండి కాలనీవాసులు నానా ఇక్కట్లు పడుతున్నారు. పారిశుధ్య పనులు చేపట్టి రెండేళ్లవుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలరోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీ సౌకర్యం లేక మురుగునీరు ఎక్కడికక్కడే రోడ్లపై ప్రవహిస్తోంది. పారిశుధ్య పనులు చేసినట్టు లెక్కలు చూపించి నిధులు స్వాహాచేస్తున్నారని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు. గ్రామపాలకులు పారిశుధ్యాన్ని గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.


ఐ.పోలవరంలో తాగునీటి కుళాయి వద్ద అపరిశుభ్ర వాతావరణం

గణపతి ఉత్సవాలకు శ్రీకారం

అంబాజీపేట, ఆగస్టు 28: స్థానిక కొర్లపాటివారిపాలెంలోని శ్రీ వేంకటేశ్వస్వామి ఆలయ సమీపంలో శ్రీబాల గణపతి నిర్వాహకుల ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా గణపతికి ప్రత్యేక పూజలుచేసి పందిరిరాట పాతారు. కార్యక్రమంలో అరిగెల శివకళ్యాణ్, కొర్లపాటి బాబి, పల్లంరాజు, పళ్ళ బాను, సత్యకుమార్, వీరా వీరబాబు, వంగా సతీష్ పాల్గొన్నారు.

జనసైనికుల సేవలు అభినందనీయం

మామిడికుదురు, ఆగస్టు28: జనసైనికులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గిడ్డిసత్యనారాయణ పేర్కొన్నారు. మొగలికుదురులో జనసైనికులు సేకరించిన రూ.2.25లక్షలు విరాళంతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు.జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్‌లు జాలెం రమణకుమారి, అడబాల తాతకాపు, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, చింతా చిన్నామామిడి భగవాన్, గనశాల దీపిక పాల్గొన్నారు.

ఘనంగా ఉట్లోత్సవం

ఆత్రేయపురం, ఆగస్టు 28: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైష్ణవ సంప్రదాయం ప్రకారం బుధవారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం వేణుగోపాలస్వామిని వెన్నతో అలంకరించారు. నవనీత అలంకరణలో వేణుగోపాలస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం రాత్రి ఉట్టి మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వైభవంగా ఉట్టి కొట్టే కార్యక్రమం జరిగింది. అర్చకులు, ఆలయ అధికారులు, భక్తులు, స్థానిక పెద్దలు ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీటీసీ బైరా నాగరాజు, అర్చకులు, వాహనదారులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంఈవో-2ల వినతి


డీఈవోకి వినతిపత్రం అందజేస్తున్న ఎంఈవో-2లు

ముమ్మిడివరం, ఆగస్టు 28: మండల విద్యాశాఖాధికారి-2గా పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని ఎంఈవో-2లు అంతా డీఈవో ఎం.కమలకుమారికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో మండల విద్యాశాఖాధికారి-2గా పనిచేస్తున్న వారంతా ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎం.కమలకుమారిని కలిసి వినతిపత్రం అందించారు. జీవో నంబరు 89ప్రకారం 2023అక్టోబరు 30న జారీచేసిన జాబ్‌చార్టును పూర్తిగా రద్దుచేసి జీవో నంబరు 154ను, 2022 జూన్ 16 జారీచేసిన జీవోను అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. గెజిటెడ్ హెడ్‌మాస్టారు లేదా ఎంఈవో-1 లేదా ఎంఈవో-2లు రిటైర్డ్ అయిన పక్షంలో సంబంధిత విద్యా సంస్థల్లో ఎంఈవో-2, ఎంఈవో-1 లేదా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించాలని వారు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపవిద్యాశాఖాధికారివారి పోస్టును సీనియర్ మోస్టు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు లేదా సీనియర్ మోస్ట్ ఎంఈవో-1 లేదా ఎంఈవో-2లతో భర్తీ చేయాలన్నారు. బొజ్జా రమణశ్రీ, పెచ్చెట్టి శ్రీనివాస్, సానబోయిన ఏడుకొండలు, ఎస్.దుర్గాదేవి, కె.లీలావతి, వైవీ సత్యనారాయణ, చోడిశెట్టి ఆంజనేయులు, ఎస్.సత్యకృష్ణ, రాయుడు ఉదయభాస్కరరావు, మోకా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక


రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుతో అసోసియేషన్ సభ్యులు

అమలాపురం టౌన్, ఆగస్టు 28: సెప్టెంబరులో జరిగే రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్, సభ్యులు మట్టపర్తి సముద్రం, డీఆర్కే. నాగేశ్వరరావు, జి.గణేష్‌బాబు, కత్తుల శ్రీనివాసరావు, పి.రత్నకుమారి, సీహెచ్‌రాజబాబు బుధవారం తెలిపారు. అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో జట్లను ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి 70మంది క్రీడాకారులు హాజరుకాగా వారిలో 30 మందిని జిల్లా జట్టుగా ఎంపిక చేసినట్టు కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈజట్టు సెప్టెంబరు 14,15తేదీల్లో అమలాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు తెలిపారు. కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు, జట్ల ఎంపికకు సహకరించిన పీఈటీ వి.బుజ్జి, జాతీయ స్థాయి పవర్ లిఫ్టర్లు ఎం.వీరేంద్ర, పి.వందన, బి.అప్పన్న, బి.యశ్వంత్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

కౌలురైతులందరూ కార్డులు తీసుకోవాలి

కాట్రేనికోన, ఆగస్టు 28 మండలంలోని కౌలురైతులందరూ సీసీఆర్సీ కార్డులు తీసుకోవాలని తహశీల్దార్ పి.సునీల్‌కుమార్ సూచించారు. సీసీఆర్సీ కార్డులపై పీఏసీఎస్‌ల ద్వారా 7శాతం వడ్డీతో రూ.లక్ష రుణం లభిస్తుందన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

రావులపాలెం, ఆగస్టు 28: పారిశుధ్య తాగునీరు అవసరాలను సక్రమంగా నిర్వహించడంతో పాటు ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకటనాగదేవి అన్నారు. రావులపాలెం మండల పరిషత్ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశంలో శాఖలవారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారి మాట్లాడుతూ రాయితీపై సూర్యఘర్ పథకంలో సోలార్ విద్యుత్ ప్లేట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ఎకరం ఖాళీ స్థలం లీజుకు ఇచ్చిన వారికి ఏడాదికి రూ.30వేలు అద్దెప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి మాట్లాడుతూ సదరం ధ్రువపత్రాల మంజూరు ఆపామన్నారు. ఇచ్చిన ధ్రువపత్రాలను పునఃపరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు గన్నవరపు వెంకట్రావు, బిప్రసాద్, కొత్తపేట డివిజనల్ అభివృద్ధి అధికారి ఎస్వీవీ రాజేశ్వరరావు, ఎంపీడీవో వీవీ సాయిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

ఆలమూరు, ఆగస్టు 28: పార్టీ అధిష్టానం ఆదేశాలను పాటించి కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ అన్నారు. ఆలమూరులో బుధవారం జనసేన పార్టీ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. నియోజకవర్గంలో ఆలమూరు మండలంలో పార్టీకి కీలకంగా ఉంటుందని, ఇదే ఒరవడిని కొనసాగించాలని ఆయన కోరారు. జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదులో విశేష కృషి చేసిన వలంటీర్లను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సూరపురెడ్డి సత్య, సలాది జయప్రకాష్‌నారాయణ, గారపాటి త్రిమూర్తులు, తమ్మన భాస్కరరావు, కొత్తపల్లి నగేష్, గుత్తుల నాగేశ్వరరావ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించి ఆదుకోవాలి

మామిడికుదురు, ఆగస్టు 28: మండలంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు జీతాలు చెల్లించాలని కోరుతూ వినతిపత్రాన్ని ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబుకు బుధవారం వారు అందించారు. వేతనాల సాధనకు శుక్రవారం అమలాపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో కె.విజయకుమారి, ఆర్.వరలక్ష్మి, దేవి, బి.అరుణ, ఐ.సత్యనారాయణమ్మ, రాధిక, కంచి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

రాజోలు, ఆగస్టు28: రాజోలు నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా పిలుపునిచ్చారు. రాజోలులో జొన్నలగడ్డ గోపాలకృష్ణ స్వగృహం వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 2నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వాల నమోదును విజయవంతం చేయాలన్నారు. అడబాల రాంబాబు, చీకురుమెల్లి శ్రీనివాసరావు, చిట్నీడి శ్రీనివాసరావు, వడ్లమూడి ప్రకాష్, దేవళ్ల మాణిక్యాలరావు, ఇంటిపల్లి రామకృష్ణ, అంకాని రాధాకృష్ణ పాల్గొన్నారు.

వినాయక చవితి రాట పూజలు

రాయవరం, ఆగస్టు28: వెదురుపాక సపటాసెంటర్ వినాయకుడి మండపం వద్ద బుధవారం వినాయకచవితి పందిరిరాట పూజలు నిర్వహించారు. తొలుత వినాయకుడికి పూజలు, హారతులునిర్వహించారు. అనంతరం కొవ్వూరి బామిరెడ్డి, వెంకటరెడ్డి దంపతులు పూజలుచేశారు. కొవ్వూరి బుల్లి వీర్రెడ్డి, కొవ్వూరి జానకిరామారెడ్డి, సత్తి సతీష్‌రెడ్డి, కొవ్వూరి మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సేవలు అమోఘం

ఆత్రేయపురం, ఆగస్టు28: ఉపాధ్యాయ వర్గాలకు యూటీఎఫ్ అందిస్తున్న సేవలు అమోఘమని టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు చెప్పారు. బుధవారం ఆత్రేయపురంలో యూటీఎఫ్ శాఖ ముద్రించిన గ్రేడింగ్ రిజిస్టర్‌ను ఆయన ఆవిష్కరించి యూటీఎఫ్ పోరాట స్ఫూర్తిని కొనియాడారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, రాష్ట్ర కౌన్సిలర్ ప్రసాద్, నాయకులు కొప్పిశెట్టి శ్రీనివాస్, మండల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, సుభాకర్‌రావు పాల్గొన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో వెంకట్రాజును సత్కరించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

యానాం, ఆగస్టు 28: స్థానిక కమల నెహ్రూ బాలిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని యానాం పరిపాలనాధికారి మునిస్వామి పరిశీలించారు. అధికారులతో కలిసి భోజనాన్ని రుచి చూశారు. ఆయన వెంట విద్యాశాఖధికారి పంపన లక్ష్మణప్రవీన్, ఆరోగ్య శాఖ డీడీ డాక్టర్ టి.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

యానాం, ఆగస్టు28: యానాం విద్యాశాఖ పరిధిలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన క్విజ్ పోటీల్లోవిజేతలకు పరిపాలనాధికారి మునిస్వామి బహుమతులు అందజేశారు. యానాం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పుదుచ్చేరి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నిర్వహణలో ఎనిమిదినుంచి 11వతరగతి చదువుతోన్న విద్యార్థులకు యానాంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. రీజెన్సీ పాఠశాలకు చెందిన విద్యార్థి గుత్తుల వెంకటపవన్‌తేజ్ (ప్రథమ), నల్లం రెసిడెన్షియల్ కాన్సెప్ట్ పాఠశాలకు చెందిన బి.వై.ప్రహర్షిణీ (ద్వితీయ), రాజీవ్‌గాంధీ పాఠశాలకు చెందిన బి.ఇసాన్ సాగార్ (తృతీయ), నాల్గవస్థానంలో రీజెన్సీకు చెందిన పోలిమారి అభినవసత్యగణేష్ నిలిచారు. 4కన్సోలేషన్ బహుమతులు సాధించారు. పరిపాలనాధికారి మునిస్వామి, ఆసుపత్రి డీడీ డాక్టర్ టి.రవిశంకర్, విద్యాశాఖధికారి పంపన లక్ష్మణప్రవీన్‌బహుమతులు అందించారు.

అంగర ఎస్ఐగా రవికుమార్



కపిలేశ్వరపురం, ఆగస్టు28: అంగరఎస్ఐ టి.రవికుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన రాజమహేంద్రవరం సీబీడీ విభాగం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీ

ముమ్మిడివరం, ఆగస్టు 28: రాజేలంకలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా బుధవారం తనిఖీ నిర్వహించారు. విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. వంటశాలలోకి వెళ్లి ఆహార పదార్థాలు వండే ప్రదేశాన్ని, వసతిగృహ రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులంతా లక్ష్యంతో విద్యను అభ్యసించి చదివిన పాఠశాల, గురువులకు మంచి గుర్తింపు తేవాలని ఆయన సూచించారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

అంబాజీపేట, ఆగస్టు28: అదనపుకట్నం కోసం వేధిస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మాచవరానికి చెందిన గాడేపల్లి కృష్ణసాయి స్వప్నదీపికకు గత ఏడాది అక్టోబరు21న గాడేపల్లి వెంకటవిక్రమ్‌తో వివాహమైంది. వృత్తిరీత్యా ఆఫ్రికా ఖండం కెన్యా దేశంలో ఉంటున్నారు. స్వప్నదీపిక కెన్యా వెళ్లిన తరువాత అత్త, మామ, భర్త, మరో 9మంది అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: డిమోంటీ
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్ర్కీన్-1	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
శేఖర్ స్ర్కీన్-2	: డబుల్ ఇస్మార్ట్
రమా	: ఆయ్
గణపతి	: రేవు
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: తంగలాన్
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: ఏలియన్ రొమ్యులస్

లైంగిక వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

ముమ్మిడివరం, ఆగస్టు 28: ప్రతీ ఒక్కరూ లైంగిక ఆరోగ్యం పట్ల కనీస అవగాహన పెంపొందించుకుని నిగ్రహ శక్తిని కలిగి ఉండాలని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని రాష్ట్ర అంగన్‌వాడీ సాధికార, డ్వాక్రా ఆర్గనైజింగ్ కార్యదర్శి మెండి కమల పేర్కొన్నారు. జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రివెన్షన్ యూనిట్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలెంలో డ్వాక్రా సంఘాల మహిళలకు బుధవారం హెచ్ఐవీ, ఎయిడ్స్, లైంగిక వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సీత, సీఆర్పీ నాగలక్ష్మి, సత్యనారాయణమ్మ, సీహెచ్‌శాంతి, గుర్రాల అమల పాల్గొన్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించాలి

పి.గన్నవరం, ఆగస్టు28: ఆరోగ్యవంతమైన పంటలు పండిచేందుకు మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించాలని డాట్ శాస్త్రవేత్త ఎం.నందకిషోర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రిన్సిపాల్ సైంటిస్టు రాధిక పేర్కొన్నారు. ఊడిమూడిలో బుధవారం నిర్వహించిన మేలైన వ్యవసాయ పద్ధతులు, పొలంబడి కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతిరైతు యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. ఎరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ఏడీఏ ఏవీ రాజశేఖర్, ఊవో మనోహర్, ఏడీఏ రామ్మోహనరావు, ఏవో ఎ.కళ్యాణసూర్యకుమార్ పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభా అవార్డుకు చింతలపల్లి హైస్కూల్ ఎంపిక

రాజోలు, ఆగస్టు 28: క్రీడా ప్రతిభా అవార్డు-2024కు పొన్నమండ జడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికైనట్టు హెచ్ఎం ఆర్.రోహిణీ తెలిపారు. ఈనెల29న క్రీడా దినోత్సవం సందర్భంగా అవార్డును అందుకుంటామన్నారు. పాఠశాలకు ఈఅవార్డు వరుసగా రెండోసారి వచ్చిందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పి.రామకృష్ణ మాట్లాడుతూ స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో విద్యార్థులు రైఫిల్ షూటింగ్, రెజ్లింగ్, సాఫ్ట్‌బాల్, ఫెన్సింగ్ అండ్ బేస్ బాల్ క్రీడాంశాల్లో ప్రతిభను కనబరిచారని తెలిపారు. విజేతలను ఎంఈవో-1 ఎన్.మనోహరం, ఎంఈవో-2 ఎస్కేడీ ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ పితాని వెంకటప్రసాద్, సభ్యులు, సర్పంచ్ కుక్కల బేబికుమారి, ఎంపీటీసీలు కడలి శ్రీదుర్గ, మోకా ఉష, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నాడు - నేడు పనుల పరిశీలన

అంబాజీపేట, ఆగస్టు28: స్థానికజడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్ననాడు నేడు పనులను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంఈవో మోకా ప్రకాష్ పరిశీలించారు. నాణ్యతో పనులు చేపట్టాలని సూచించారు. అదనపు తరగతి గదులను త్వరిగతిన పూర్తిచేయాలన్నారు. హెచ్ఎం కడలి సాయిరామ్ ఉన్నారు.

హార్బరును పరిశీలించిన ఆర్డీవో

అంతర్వేది, ఆగస్టు 28: అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరును అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి బుధవారం పరిశీలించారు. సర్వే మ్యాప్‌లను, రికార్డులను పరిశీలించి భవన నిర్మాణాల స్థితిగతులను మండల రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో టీడీపీ హయాంలోనే నిర్మించిన ఈఫిషింగ్ హార్బరును మళ్లీ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో హార్బరుకు సంబంధించి కమిటీని ఏర్పాటుచేసే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. మండల అధికారులతో ఆర్డీవో కేశవర్ధనరెడ్డి హార్బరుపై సమీక్షించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, మండల సర్వేయర్ భద్రరాజు, తిరుమాని ఆచార్యులు, పోతాబత్తుల రాంబాబు, వీఆర్వో, విలేజ్ సర్వేయర్లు, స్థానిక మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ క్రీడా దినోత్సవం

అమలాపురంరూరల్, ఆగస్టు 28: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని పాలగుమ్మి జడ్పీ ఉన్నత పాఠశాల చిత్రలేఖనం ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహచంద్రకుమార్ హాకీ క్రీడాకారులతో కూడిన మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రాన్ని, గిడుగు వెంకటరామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు తల్లితో పాటు గిడుగు వారి చిత్రాన్ని వాటర్ పెయింటింగ్స్‌తో చిత్రీకరించారు. క్రీడా దినోత్సవంలో భాగంగా అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లోగురువారం ఒలింపిక్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు మునగాల మన్నం, గెడ్డం భీమరాజు, పలువురిని సత్కరిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు తెలిపారు.

రూ.70లక్షలతో ఆసుపత్రికి సీసీ కెమెరాలు


ఆలమూరు ఆసుపత్రి వద్ద సీసీ కెమెరాలు, ఫ్యాన్లు అందించిన బట్టీ యూనియన్ నాయకులు

ఆలమూరు, ఆగస్టు28: ఆలమూరు ప్రభుత్వాసుపత్రిలో ఫ్యాన్లు లేక ఇబ్బందులు పడుతుండటంతో పాటు ఆసుపత్రి సిబ్బంది భద్రత నేపథ్యంలో ఆలమూరు ఇటుకబట్టీల యూనియన్ ఆధ్వర్యంలో రూ.70లక్షలతో సీసీ కెమెరాలు, ఫ్యాన్లు సమకూర్చారు. వీటిని ఆసుపత్రి వైద్యులకు బుధవారం యూనియన్ అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చల్లా ప్రభాకరరావు, ఈదల సత్తిబాబు, రామానుంజుల శేషగిరిరావు, ఈదల నల్లబాబు, వంటిపల్లి సతీష్, బొబ్బా వెంకటనారాయణ, రాంబాబు, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

కె.గంగవరం, ఆగస్టు 28: ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని తహశీల్దార్ కె.సూర్యారావు అన్నారు. బుధవారం ఆయన పామర్రు, యండగండి గ్రామాల్లో ఈక్రాప్ నమోదు, సీసీ కార్డులు జారీ ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటికే మండలంలో 73శాతం ఈక్రాప్ నమోదు పూర్తయిందన్నారు. సెప్టెంబరు 15లోగా నూరు శాతం పూర్తవుతుందన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఏఏలు ఉన్నారు.

రికార్డుల కంప్యూటరీకరణ వేగవంతం చేయండి

కె.గంగవరం, ఆగస్టు 28: మండలంలో సొసైటీ రికార్డులు కంప్యూటరీకరణ వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన గంగవరం, సత్యవాడ సొసైటీల్లో జరుగుతున్న రికార్డుల కంప్యూటరీకరణ ప్రక్రియను పరిశీలించారు. వచ్చేనెలాఖరు నాటికి నూరుశాతం కంప్యూటరీకరణ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి బలుసు రవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటుచేయాలి

ముమ్మిడివరం, ఆగస్టు 28: వర్షాల వల్ల గ్రామాల్లో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వారికి వైద్య సేవలు అందించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఉదయభాస్కరవర్మ కోరారు. గ్రామాల్లో బ్లీచింగ్, ముగ్గు, శానిటేషన్ చర్యలు చేపట్టాలని, ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో వసతులు మెరుగుపరచాలని ఆయన కోరారు.

జనసైనికుల పరామర్శ

ముమ్మిడివరం, ఆగస్టు 28: రాజేలంక గ్రామానికి చెందిన పల్లపు గంగరాజు విద్యుదాఘాతానికి గురై మృతిచెందగా కుటుంబ సభ్యులను జనసైనికులు బుధవారం పరామర్శించారు. జనసేనపార్టీ ప్రమాద బీమా రూ.5లక్షలు త్వరలో మంజూరు అవుతుందన్నారు. కార్యక్రమంలో గుద్దటి జమి, గోదశి పుండరీష్, దూడల స్వామి, అత్తిలి బాబూరావు, విళ్ల వీరా పాల్గొన్నారు.

'మృతిచెందిన వ్యక్తిది కె.జగన్నాథపురం..'

కాట్రేనికోన, ఆగస్టు 28: ఇటీవల కుండలేశ్వరం గోదావరి కాల్వ వద్ద కనుగొన్న గుర్తుతెలియని మృతదేహం వివరాలను కాట్రేనికోన పోలీసులు వెల్లడించారు. అయినవిల్లి మండలం కె.జగన్నాథపురానికి చెందిన బల్లా శ్రీరామచంద్రమూర్తిగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు పరామర్శ

రాయవరం, ఆగస్టు 28: ఇటీవల పాటుకాటుకు గురైన అంగన్‌వాడీ కార్యకర్తను బుధవారం పలువురు పరామర్శించారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న వెంటూరుకు చెందిన దుర్గ ఇటీవల పాముకాటుకు గురైంది. చికిత్స అనంతరం కోలుకుంటున్న దుర్గను మండపేట ఐసీడీఎస్ పీవో ఎ.జగలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణవేణి పరామర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు డి.ఆదిలక్ష్మి తదితరులు ఉన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి

అంబాజీపేట, ఆగస్టు 28: హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని విశ్వ హిందూ పరిషత్ ప్రాంత అధికారి సాయిరామ్ అన్నారు. పుల్లేటికుర్రులోని శ్రీవాసవి కన్యాకపరమేశ్వరి కల్యాణ మండపంలో విశ్వహిందూ పరిషత్ ఏర్పాటై 60ఏళ్లు పూర్తయిన సందర్భంగా దివాస్ వేడుకలను మంగళవారం రాత్రి నిర్వహించారు. అక్షితాన్ అభియాన్, రథయాత్ర, సామూహిక వరలక్ష్మి వ్రతాలను జిల్లాలో విశ్వహిందూ పరిషత్ నిర్వహించిందన్నారు. సమావేశంలో కార్యదర్శి ప్రయోగ నరసింహమూర్తి, భమిడపాటి కృష్ణమూర్తి, కడలి వెంకటేశ్వరరావు, అయ్యగారి వెంకట్రావు పాల్గొన్నారు.

కార్మికులను అక్రమంగా తొలగించారంటూ ఆందోళన

కాట్రేనికోన, ఆగస్టు 28: మధ్యాహ్నభోజన కార్మికులను, శానిటేషన్ వర్కర్లను అక్రమంగా తొలగించారంటూ బుధవారం ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన జరిగింది. గతంలో ఉన్నవారిని కూటమి ప్రభుత్వం తొలగించి తప్పు చేస్తోందంటూ ఉద్యమకారులు ఆరోపించారు. ఎంఈవోకు వినతిపత్రం సమర్పించారు. విత్తనాల రాంబాబు, విప్పర్తి మోహనరావు, దుర్గామహేశ్వరి, జి.దుర్గ, బొంతు పార్వతి, గుత్తుల కనకదుర్గ, మల్లు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

డాక్టర్‌పై అత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలి

రాయవరం, ఆగస్టు 28: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను శిక్షించాలని కోరుతూ సోమేశ్వరంలో సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్కీమ్ వర్కర్లు నిరసన చేపట్టారు. ఈకార్యక్రమంలో అనంతలక్ష్మి, వి.చంద్రకళ, దుర్గాభవాని, ఎం.కమల, ఎస్. నూకరత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా, మిడ్ డేమీల్స్ వర్కర్లు, వివిధ పాఠశాలల స్వీపర్స్ పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

రాజోలు, ఆగస్టు 28: తాటిపాకలో పంట పొలాలను క్షేత్రస్థాయిలో మార్టేరు శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కీటక శాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త పి.రాధిక, వ్యవసాయ యాంత్రీకరణ శాస్త్రవేత్త అప్పారావు, కోఆర్డినేటర్ నందకిశోర్, డీఆర్సీ పీడీ కిరణ్మయి, ఏడీఏ రాజశేఖర్, ఏవోలు మనోహర్, వై.మధుకుమార్, రైతులు దేవళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం

అంతర్వేది,ఆగస్టు28: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం తాడేపల్లిగూడేనికి చెందిన కలిశెట్టి వెంకటేశ్వరరావు-రామలక్ష్మి దంపతులు నిత్యాన్నదానానికి రూ.50వేలువిరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథికి అందించారు. దాతలకు స్వామివారి చిత్రపటం,ప్రసాదంఅందించారు.

కొత్త మోడల్ కారు విడుదల

మలికిపురం, ఆగస్టు 28: టాటా మోటార్స్‌కు సంబంధించిన టాటా కర్వ్ ఎలక్ట్రికల్ వాహనాన్ని తొలిగా మలికిపురం శివశంకర్ మోటార్సులో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. ఈమోడల్‌కారు 40నిమిషాలు బ్యాటరీ చార్జింగ్ చేస్తే 580 కిలోమీటర్ల ప్రయాణం చేయవచ్చని తెలిపారు.